# ఎవళ్ళదివాళ్ళకానందం

శ్రీ ఆయపిళ్లరామారావు

"నీ దురభ్యాసానికి ఫలితం నువ్వే అనుభవించాల"ని తన సహజగుణాన్ని వ్యక్తంచేస్తూ నా 'విల్సు సిగరెట్' పొగ ఓవంక సుఖపెడుతూ మరోవంక కళ్లంట నీళ్లుకార్పిస్తూనేవుంది.

పండక్కి వచ్చినఅల్లుడు చూపించే 'జీ' ఇలాగే వుంటుందన్నట్లు మామూలుకన్నా ఓఘంట ఆలస్యంగా లేవటం నిద్రకళ్లతోనే రహస్యమందిరంలో పడటం మావాళ్లు చూడకపోలేదు — ఎవరేమనుకున్నా నావెర్రినాదే— ఆ వాతావరణం యధాప్రకారంగా నన్ను ఆలోచనా సముద్రంలో ముంచింది. నాకు మొదటతట్టిన ఆలోచన నన్నుగురించే ఆఖరికి స్థిరపరచుకున్నా 'ఎవళ్లదివాళ్లకానంద'మని. మాటకి, మాబావ ఎందుకల్లా తనకే అర్థంకాని భావగీతాలు (నాఉద్దేశంలో బండబూతులు) వ్రాస్తూకూచుంటాడు. ఏం...తనకలాన్ని కబళానికర్రవైన కష్టజీవులబాధల్ని చిత్రించడంలో నడపకూడదూ?... మాఅత్త తనకోడల్ని నిందించటంతోనే కాలం గడపడమేం? మా మాంవ అబద్ధపుసాక్ష్యాల్ని అన్యాయవాదంతో గ్రుడ్డిప్రభుత్వం యెదట నిలిపి సంపాదించిన డబ్బంతా కాగితాలమయంచేస్తాడేం?... మెతుకులకోసం మృత్యుదేవతకి బలిఅవుతూన్న తోబుట్టువులకి సహాయం చేసి మా దేవత అశ్రుకణాల్ని అరికట్టరాదూ?...'ప్రోప్రగాండాన్యూస్' కన్న పచ్చిడాబుల్రాయడని ప్రపంచానికంతటికీ తెలిసినా పిల్లిపాల్తాగుతూనట్టు పడబొంసుతాడు మాపొరుగింటాయన. 'జీవహింసాప్రతికూలసంఘా'నికి 'మార్గదర్శి'అని అచ్చువేయించిన కాగితాలు పంచిపెట్టిస్తూ రోజుకి అధమం పధైనా నిండుజీవాల్ని పొట్టబెట్టుకుంటాడు మా జమీందారుగారు. 'హరిదాసు'నని అరడజను కురుడీల్ని హతమారుస్తూంటాడు మాభాగవతర్. ఉపన్యాసాలు దంచేస్తూతవదాకావస్తే తగువులేదంటాడు మా సంస్కర్త చలపతి. నోరువిప్పితే'జీవాత్మ' 'పరమాత్మ' 'రజ్జుసర్పభ్రాంతి' ఇత్యాది వేదాంతప్రయోగాలు చేస్తూ కొంపలుతీస్తూంటాడు మావేదాంతి! లత్తువత్తులవ్రతాన్ని ఆచరిస్తూన్న తనపెళ్లాన్ని తెగపొగడుతాడు మా వెంకట్రావు... 'టాకీల'మూలాన మూలబడినా, 'త్యాగమూర్తి'లాగుండి 'హీరోయిన్'గా 'స్టేజి' ఎక్కి, చెప్పులతో కొట్టించుకునేవాడు మాబాబు...... తత్వభేదాల్లో వున్న నియంతృత్వాలు, అతితెలివిలావవటం మూలాన—ఆలోచనకందని కారణాలకోసం, 'శకండు'కు శతసహస్ర ప్రాణాల్ని భస్మీభూతం చేయించేయి, అసలు మానవత్వాన్నే మరచి ......ఎదటివాళ్లకి ఎలుగొడ్డుబుర్రల్లే కనిపించేలా '(క్రాఫు)' వుంచుకుంటాడు 'కాఫీయిస్టు' కామేశ్వర్రావ్. తనరాష్ట్రమేదో తనసంగతేదో కూడా తెలుసుకోన్దే పరరాష్ట్రాలవాళ్లని వెనకేసుకొస్తాడు మా తిరుమల్రావ్...............

చేతివ్రేళ్లని చురికించి 'సిగరెట్' క్రిందపడటం మిగతాతంతు ముగియడం. వాటంతటనే జరిగినయి. "ఎవరోయ్ బ్రహ్మదేవుడు లోపల" మా మరదలుపిల్ల కేకమాత్రం నా చెవులబడ్డది. నేను బయటపడగానే "అంతసేపు దాన్లో ఎల్లాకూర్చున్నావోయ్" అనే కొంటెప్రశ్నకు "ఎవళ్లదివాళ్లకానందం" అన్నజవాబు అనుకోకుండగనే వచ్చేసింది నా నోటంట.

[పేర్లుకూడా కేవలం కల్పితం]


## కుట్టుపని స్వబోధిని

కోట్లు, ట్రౌజర్లు, షర్టులు, జాకెట్లు కత్తిరించి కుట్టు క్రొత్తపద్ధతులు డ్రాయింగులలో గలదు. స్త్రీలు, పురుషులు, బాలికలు యీగ్రంథముచూచి సులభముగా నభ్యసించతగినది. ప్రతి దర్జీవారికిని ముఖ్యముగా చేతిలో వుండవలసిన పుస్తకము. ధర అ. 10.

మహారాజ పుస్తకశాల,

12, అరుణాచల మొదలివీధి, 18, బీటు, మద్రాసు.